సాక్షి
కామారెడ్డి
మంగళవారం। 5। డిసెంబర్। 2023

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లాలో తుపాను ప్రభావం

రుద్రూర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మిచౌంగ్ తుపాను ప్రభావం వల్ల వర్షాలు కురిసే అవకాశమున్నట్లు రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ టి అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఆకాశం మేఘావృతమై సాయంత్రం సమయం తర్వాత చిరుజల్లులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి వర్షం కురిసే అవకాశముందని పేర్కొన్నారు. బుధవారం ఉరుములు, మెరుపులు, పిడుగులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశమున్నట్లు వివరించారు.

8న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 8న ఉదయం 10:30 గంటలకు చైర్‌పర్సన్ శోభ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు సీఈవో సాయాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, శాసనసభ్యులు హాజరు కావాలని కోరారు.

టీఆర్‌టీఎఫ్ అధ్యక్షుడిగా బషీర్

కామారెడ్డిఅర్బన్: తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్‌టీఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా ఎంఏ బషీర్, కార్యదర్శిగా జె రాజేశ్వర్ ఎన్నికయ్యారు. టీఆర్‌టీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో జరిగింది. ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిలర్లుగా ప్రసన్న కుమార్, సంతోష్, రాష్ట్ర కార్యదర్శిగా అజ్మత్‌ను నియమించారు. సమావేశంలో పీఆర్‌సీ అమలు, 317 జీవోతో ఉపాధ్యాయుల సమస్యలు, నిలిచిపోయిన బదిలీలు, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని చర్చించారు.

కొనసాగుతున్న క్రషింగ్

సదాశివనగర్: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలోగల గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. ఆదివారం నాటికి 39,845 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

10న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలో ఈనెల 10న రాష్ట్రస్థాయి నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు www.bse.telangana.gov.inలో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

నేడు మొబైల్‌సైన్స్ ఎగ్జిబిషన్ వర్క్‌షాప్

తెయూ(డిచ్‌పల్లి): 'జన్యుశాస్త్రంలో మార్పులు – ఆరోగ్యంపై ప్రభావం' అనే అంశంపై తెలంగాణ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్ మామిడాల ప్రవీణ్ తెలిపారు. విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నాలజీ మ్యూజియం– బెంగళూరు, సీసీఎంబీ హైదరాబాద్ శాస్త్రవేత్తల సహకారంతో వర్క్‌షాప్ నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు సోమవారం తెయూ రిజిస్ట్రార్ యాదగిరి చేతుల మీదుగా వర్క్‌షాప్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ తెయూ పరిధిలోని అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులతోపాటు ఇంటర్మీడియెట్, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు వర్క్‌షాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో బయోటెక్నాలజీ విభాగం అధ్యాపకులు కిరణ్మయి, జవేరియా పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న తెయూ రిజిస్ట్రార్

• నేత్రపర్వంగా లక్ష దీపార్చన




రామారెడ్డి: ఇసన్నపల్లి(రామారెడ్డి)లో వెలసిన శ్రీకాలభైరవుడి జన్మదిన వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. 72 గంటల పాటు కొనసాగే సంతతధారాభిషేకం సోమవారం కొనసాగింది. వేడుకల్లో ముఖ్య ఘట్టమైన లక్షదీపార్చన సాయంత్రం 6:00 నుంచి ప్రారంభమైంది. దీపార్చనను ఆలయ ఈవో ప్రభుగుప్తా ప్రారంభించారు. మహిళలు, యువతులు ఆలయంలో దీపాలు వెలిగించారు. లక్ష దీపార్చన కనుల పండువగా సాగింది. భైరవ నామస్మరణతో ఆలయం మార్మోగింది. మంగళవారం బంగారు భైరవుడి దోలారోహణం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ, వంశీకృష్ణ, ఉపసర్పంచ్ ప్రసాద్, నాయకులు రాజేందర్‌గౌడ్, రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కంచుకోటకు బీటలు!

- ఉద్యమంలో గులాబీ జెండాను ముద్దాడిన నేల
- రాష్ట్రం ఏర్పాటయ్యాక రెండుసార్లు ఆదరించిన గడ్డ
- ఈసారి ఓటు రూపంలో పెల్లుబుకిన అసంతృప్తి
- సీఎం పోటీ చేసినా తప్పని ఓటమి
- నైరాశ్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు

తెలంగాణ ఉద్యమంలో గులాబీ జెండాను హత్తుకున్న పల్లెలిప్పుడు అదే పార్టీపై తిరుగుబాటు జెండా ఎగురవేశాయి. తొమ్మిదిన్నరేళ్ల పాలన మీద అసంతృప్తిని ఓట్ల రూపంలో బయటపెట్టాయి. ఆఖరుకు సీఎం కేసీఆర్ పోటీ చేసినా ఆదరించలేదు. దీంతో కామారెడ్డితో పాటు పొరుగునే ఉన్న ఎల్లారెడ్డి నియోజక వర్గం, ఆ పక్కనే ఉన్న జుక్కల్‌లోనూ బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పలేదు. వరుసగా గెలిపించిన ప్రజలు ఈసారి వద్దనుకుని సాగనంపారు.



సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. కేసీఆర్ నాయకత్వంలో 2001 లో ప్రారంభమైన తెలంగాణ ఉద్యమంలో కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో చైతన్యవంతమైన సమాజం గులాబీ జెండాను చేతబట్టి ఉద్యమంలో ముందుండి నడిచింది. టీఆర్‌ఎస్ స్థాపించిన తొలినాళ్లలోనే జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మాచారెడ్డిలో ఎంపీటీసీలను ఏకగ్రీవంగా ఎన్నుకుని ఎంపీపీ పీఠాన్ని కైవసం చేసుకుంది. అలాగే ఎనిమిది జెడ్పీటీసీ స్థానాలను గెలుచుకుని జిల్లా పరిషత్‌పై గులాబీ జెండా ఎగరడంలో కీలకభూమిక పోషించింది ఈ రెండు నియోజకవర్గాలే.. 2004 ఎన్నికల్లో ఎల్లారెడ్డి నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఏనుగు రవీందర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా కామారెడ్డి నుంచి పోటీ చేసిన షబ్బీర్ అలీని ఇక్కడి ప్రజలు ఆదరించి అసెంబ్లీకి పంపించారు. తెలంగాణ సాధన కోసమే ఎన్నికల్లో విజయతీరాలకు తీసుకువెళ్లారు. 2008 లో ఎమ్మెల్యేల రాజీనామాతో జరిగిన ఉప ఎన్నికలో ఎల్లారెడ్డిలో ఏనుగు రవీందర్‌రెడ్డిని ఓడించినా ఆ తర్వాత 2009లో జరిగిన ఎన్నికల్లో మాత్రం ఆయననే గెలిపించారు.

తెలంగాణ ఉద్యమం ఫలితంగా ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు అప్పటి కేంద్ర మంత్రి చిదంబరం 2009 డిసెంబర్ 9న పార్లమెంటు సాక్షిగా ప్రకటించారు. అయితే ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు చెప్పగానే ఆంధ్ర ప్రాంతంలో సమైక్యాంధ్ర ఉద్యమం ప్రారంభమవడంతో అప్పటి ప్రభుత్వం వెనక్కి తగ్గింది. దీంతో మరోసారి ప్రజలు తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేశారు. ప్రజల నుంచి తీవ్ర నిరసనలు రావడం, ఉద్యమకారులు ఆత్మబలిదానాలకు పాల్పడడంతో అప్పటి టీడీపీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, పోచారం శ్రీనివాస్‌రెడ్డిలు తమ పదవులకు రాజీనామా చేసి గులాబీ కండువా కప్పుకున్నారు. ఉప ఎన్నికలలో బీఆర్‌ఎస్ తరఫున బరిలో నిలవగా.. ఓటర్లు వారినే తిరిగి ఎన్నుకున్నారు. తరువాత ఉద్యమం తీవ్రమై సబ్బండ వర్ణాలు భాగమయ్యాయి. రైల్‌రోకో, హైవేల దిగ్బంధం వంటి కార్యక్రమాలు, సకల జనుల సమ్మెల్లో జిల్లా ప్రజలంతా పాల్గొన్నారు. ఎన్నో పోరాటాలతో స్పందించిన కేంద్ర ప్రభుత్వం.. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. 2014 జూన్ 2న నూతన రాష్ట్రం ఆవిర్భవించింది. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష నెరవేరడంతో జిలా ప్రజలంతా సంతోషించారు.

అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయాలు..

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం జరిగిన ఎన్నికల్లో జనం జిల్లాలో గులాబీ పార్టీకి సలాం కొట్టారు. కామారెడ్డి నుంచి గంప గోవర్ధన్, ఎల్లారెడ్డి నుంచి ఏనుగు రవీందర్‌రెడ్డి, బాన్సువాడ నుంచి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జుక్కల్ నుంచి హన్మంత్ సింధేలను గెలిపించారు. 2018 ఎన్నికల్లో కూడా కామారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజక వర్గాల నుంచి తిరిగి గంప గోవర్ధన్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, హన్మంత్ సింధేలనే అసెంబ్లీకి పంపించారు. ఎల్లారెడ్డిలో వరుసగా మూడుసార్లు గెలుపొందిన ఏనుగు రవీందర్‌రెడ్డిని మాత్రం ఓడించి, మరో ఉద్యమ నాయకుడైన కాంగ్రెస్ అభ్యర్థి జాజాల సురేందర్‌ను గెలిపించారు. కొద్దిరోజుల్లోనే ఆయన కూడా గులాబీ తీర్థం పుచ్చుకున్నారు.

ఈసారి మూడుచోట్ల ఓటమి

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ విఫలమైందన్న భావన బలపడుతూ వచ్చింది. దీంతో గులాబీ కోట బీటలు వారింది. సీఎం కేసీఆర్ స్వయంగా కామారెడ్డి నియోజకవర్గం నుంచి బరిలో నిలిచినా.. ప్రజలు ఆయననూ తిరస్కరించారు. అలాగే ఎల్లారెడ్డిలో బరిలో నిలిచిన జాజాల సురేందర్‌రెడ్డి, జుక్కల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన హన్మంత్ సింధేలనూ ఓడించారు. బాన్సువాడ నియోజకవర్గంనుంచి పోటీ చేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఒక్కరే గెలుపొందారు. కేసీఆర్ ఉద్యమం తొలినాళ్లలో కామారెడ్డి నియోజక వర్గంలో బ్రిగేడియర్‌గా పనిచేశారు. నియోజకవర్గంలోని చాలా గ్రామాలు ఆయనకు తెలుసు. కేసీఆర్ అంటే అభిమానించే వాళ్లు ఇక్కడ వేలాది మంది ఉంటారు. అలాంటిది కేసీఆర్ పోటీ చేసినా ఓడిపోవడం ఉద్యమకారులు, అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. పార్టీ ఓటమితో శ్రేణుల్లో నైరాశ్యం అలుముకుంది.

సన్నాలకు ఫుల్ డిమాండ్

- జైశ్రీరాం రకానికి క్వింటాలుకు రూ. 3,100
- సూపర్ సీడ్ రకానికి రూ. 2,600
- సన్న రకాలను కొనుగోలు చేసి నిల్వ చేస్తున్న మిల్లర్లు, స్టాకిస్టులు



మోర్తాడ్(బాల్కొండ): సన్నరకం వరి ధాన్యాలను కొనుగోలు చేయడానికి మిల్లర్లు, స్టాకిస్టులు పోటీ పడుతున్నారు. సన్న రకాల్లో ఎక్కువ డిమాండ్ ఉన్న జై శ్రీరాం రకానికి క్వింటాలుకు రూ. 3,100ల వరకు ధర చెల్లిస్తున్నారు. సూపర్ సీడ్ రకానికి రూ. 2,600 వరకు ధర పలుకుతోంది. గతంలో ధర తక్కువగా ఉండటంతో రైతులకు పెద్దగా లాభం కలగలేదు. ఈసారి గతంలో కంటే ఎక్కువధర లభించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సన్నరకాలను కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే ధర తక్కువగా ఉండగా, వ్యాపారులే ఎక్కువ ధర చెల్లిస్తున్నారు. దీంతో రైతులు సన్న రకాలను మార్కెట్‌లోనే విక్రయిస్తున్నారు. వర్షాకాలం సీజన్‌లో సన్నరకాలనే ఎక్కువగా సాగు చేయడం వల్ల కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించిన సందర్భాలు తక్కువగా ఉన్నాయి. దొడ్డురకాలను సాగు చేసిన కొంత మంది రైతులు మాత్రమే కొనుగోలు కేంద్రాలను ఆశ్రయించారు. సన్న రకాలను సాగు చేసిన వారు వ్యాపారులకే ధాన్యం విక్రయిస్తున్నారు. వ్యాపారులు 15 రోజుల నుంచి నెల రోజుల్లో ధాన్యం డబ్బులు చెల్లించడానికి ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. రైతులు తమకు నమ్మకమైన వ్యాపారులకే ధాన్యంను విక్రయిస్తున్నారు. ఏది ఏమైనా సన్న రకం ధాన్యాన్ని ఫుల్ డిమాండ్ ఉండటంతో రైతులకు ఊరట లభించిందని చెప్పవచ్చు.

కామారెడ్డి ప్రజలకు రుణపడి ఉంటా

- అరుదైన నేత వెంకటరమణారెడ్డికి శుభాకాంక్షలు..
- లోటుపాట్లపై సమీక్షిస్తాం
- ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి క్రైం: కామారెడ్డిలో 15 ఏళ్లుగా తనకు అండగా నిలిచిన ప్రజలకు రుణపడి ఉంటానని ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన బీజేపీ అభ్యర్థి వెంకట రమణారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ అధినేత కామారెడ్డి నుంచి పోటీ చేయడం, అనూహ్యంగా ఓటమి చెందడం బాధించిందన్నారు. ఓటమికి గల కారణాలను సమీక్షించుకుని బలమైన ప్రతిపక్షంగా నిలబడతామన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన ప్రతిసారి కామారెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఆశించిన నిధులు తీసుకువచ్చి కామారెడ్డిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. 2010లో ప్రజల అభీష్టం మేరకే టీఆర్‌ఎస్‌లో చేరానన్నారు. ఆరు గ్యారంటీల మేనిఫెస్టోతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేసి ప్రజల మన్ననలు పొందాలని వ్యాఖ్యానించారు.



మాట్లాడుతున్న గంప గోవర్ధన్

కామారెడ్డిలో గెలిచిన వెంకటరమణారెడ్డి రూ.150 కోట్లతో తన సొంత మేనిఫెస్టోను విడుదల చేశారని గుర్తు చేశారు. తన ఆస్తులైనా అమ్మి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, ఆధునిక హంగులతో పాఠశాలలు, రైతు కల్లాలు, తదితర పనులను చేయిస్తానని మేనిఫెస్టోలో పేర్కొన్నారన్నారు. ఈ రోజుల్లో అలాంటి రాజకీయ నాయకులు అరుదుగా ఉంటారని కొనియాడారు. అన్నింటినీ అమలు చేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఇక మీదట కూడా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ఇంతకాలం తాను సాధించిన విజయాల్లో వెన్నంటి ఉన్న ప్రజలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బల్వంత్ రావు, సంగి మోహన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యాసంగికి 'సాగర్' భరోసా

- నారుమళ్లకు ప్రధాన కాలువ ద్వారా నీటి విడుదల
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు

నిజాంసాగర్: నిజాంసాగర్‌లో సమృద్ధిగా నీరు ఉండటంతో యాసంగి సాగుకు రైతన్నలు సన్నద్ధమవుతున్నారు. ఆయకట్టు కింద పంటల సాగుకు 10 నుంచి 14 టీఎంసీల నీరు అవసరం. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 16 టీఎంసీల నీరు ఉండటంతో పంటల సాగుకు ఢోకా లేనట్లే. దీంతో నిజాంసాగర్, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, వర్ని, రుద్రూర్, పోతంగల్, కోటగిరి, నవీపేట, నందిపేట్, బోధన్ మండలాల్లో ఆయకట్టు కింద ముందస్తు సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. ముందస్తు సాగులో భాగంగా నీటిపారుదలశాఖ అధికారులు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు వారం రోజుల పాటు నీటిని విడుదల చేశారు. దాంతో రైతులు భూములను దుక్కి చేసి నారు పోశారు. వరి సాగుకు అన్నదాతలు సమాయత్తం అవుతున్నారు.

1.5 లక్షల ఎకరాల్లో పంటల సాగు

నిజాంసాగర్ మొదటి ఆయకట్టుతో పాటు అలీసాగర్ వరకు ఉన్న డిస్ట్రిబ్యూటరి నంబర్ 49 వరకు 1.5 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయనున్నారు. ఇప్పటి వరకు ఆయకట్టు కింద పంటలు సాగు, నారుమళ్లు వేసుకునేందుకు ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు. మొదటి ఆయకట్టుతో పాటు అలీసాగర్ వరకు పంటల సాగుకు నీటిని విడుదల చేస్తామని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికే వర్ని, రుద్రూర్, నస్రుల్లాబాద్ ప్రాంతాల్లో వరి నారుమళ్లు వేసుకొని 25 రోజులు అవుతుండటంతో సాగుకు రైతులు సిద్ధం అవుతున్నారు. దీంతో సాగుకు అవసరమైన నీటిని ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు విడుదల చేయనున్నారు.



ఆయకట్టు కింద నారుమళ్లు

అమాత్య యోగమెవరికో?

- షబ్బీర్ అలీ నసీబ్ ఎట్లుందో..
- మదన్‌మోహన్‌రావుకు ఐటీ శాఖ ఇస్తారన్న ప్రచారం
- కాంగ్రెస్ శ్రేణుల్లో జోరుగా చర్చలు




షబ్బీర్ అలీ..



మదన్‌మోహన్‌రావు

సాక్షి, కామారెడ్డి: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడంతో మంత్రి పదవులపై చర్చ మొదలైంది. జిల్లా నుంచి ఎవరికి అవకాశం దక్కుతుందోనన్న దానిపై ఊహాగానాలు జోరందుకున్నాయి. జిల్లాలో సీనియర్ కాంగ్రెస్ నేత అయిన షబ్బీర్‌అలీ గురించి పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మైనారిటీ కోటాలో ఆయనకు మంత్రి పదవి వస్తుందని ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. అలాగే తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టిన సాఫ్ట్‌వేర్ సంస్థల యజమాని, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావుకు కాలం కలిసొస్తే ఐటీ మంత్రిగా అవకాశం రావచ్చన్న ప్రచారం జరుగుతోంది.

జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా.. ఎల్లారెడ్డి, జుక్కల్‌లలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. ఇద్దరు కూడా తొలిసారి విజయం సాధించారు. ఇందులో మదన్ మోహన్‌రావు ఐటీ కంపెనీల యజమాని. ఆయనకు పార్టీ జాతీయ నేతలతో సన్నిహిత సంబంధాలున్నాయి. అదే ఆయనకు ఎల్లారెడ్డి టికెట్టు రావడానికి కారణమైంది. ఆయనకు మంత్రి మండలిలోనూ అవకాశం కల్పిస్తారని పార్టీ నాయకులు ఆశిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో అనుభవంతో పాటు పార్టీలో ఐటీ రంగానికి సంబంధించి వివిధ రకాల సేవలందించినందున ఆయనకు ఐటీ శాఖ మంత్రి బాధ్యతలు ఇస్తారన్న ప్రచారం జరుగుతోంది.




మైనారిటీ కోటాలో..

జిల్లాలో సీనియర్ నాయకుడైన మాజీ మంత్రి షబ్బీర్‌అలీ.. 1989లో తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే అప్పటి చెన్నారెడ్డి మంత్రిమండలిలో అవకాశం దక్కించుకున్నారు. తర్వాత 2004 ఎన్నికల్లో విజయం సాధించి వైఎస్సార్ మంత్రి మండలిలో క్యాబినెట్ మంత్రిగా చేరారు. 2009 లో ఎమ్మెల్యేగా ఓడిపోయినా కాంగ్రెస్ అధిష్టానం ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి, శాసన మండలి ప్రతిపక్ష నేతగా బాధ్యతలు అప్పగించింది. ఆయన 2014, 2018 ఎన్నికల్లోనూ ఓటమి పాలయ్యారు. ఈసారి ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో ఆయన నాలుగైదేళ్లుగా జనంలోనే ఉండి నిరంతరం పనిచేశారు. అయితే కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ పోటీకి దిగడంతో షబ్బీర్ స్థానంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బరిలోకి వచ్చారు. మైనారిటీ ఓటర్లు ఎక్కువగా ఉన్న నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి షబ్బీర్‌ను బరిలోకి దింపినా గెలవలేకపోయారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో షబ్బీర్‌కు మంత్రి మండలిలో అవకాశం దక్కుతుందన్న ప్రచారం ఊపందుకుంది. ఉమ్మడి జిల్లానుంచి గెలిచిన కాంగ్రెస్ నేతల్లో ఎవరికి మంత్రి పదవి దక్కుతుందోనన్న విషయమై అంతటా చర్చలు నడుస్తున్నాయి.

20 ఏళ్లుగా అర్బన్‌కు దక్కని మంత్రి పదవి

సుభాష్‌నగర్ : నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి 20 ఏళ్లుగా మంత్రి పదవి దక్కడం లేదు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన డి.శ్రీనివాస్‌కు మంత్రి పదవి దక్కింది. అదే నిజామాబాద్ అర్బన్‌కు దక్కిన చివరి మంత్రి పదవి. 2009లో బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత 2014, 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున గణేశ్ గుప్తా గెలుపొందారు. రాష్ట్రంలోనూ అదే పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ గణేశ్ గుప్తాకు మంత్రి పదవి దక్కలేదు. ఈసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ధన్‌పాల్ సూర్యనారాయణ బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. అంటే ఈసారి కూడా నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి మంత్రి పదవి లేనట్లే..



క్లుప్తంగా

జాతీయ స్థాయికి ఎదగాలి



బాల్కొండ: క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో రాణించి జాతీయ స్థాయికి ఎదగాలని బాస్కెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి అన్నారు. మెండోరా మండలం బుస్సాపూర్‌లో 70వ సీనియర్ బాలికల కబడ్డీ టోర్నీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈగ సంజీవ్, కబడ్డీ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి గంగాధర్, సర్పంచ్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

నిజాంషుగర్స్‌కు మంచి రోజులు



బోధన్: రాష్ట్రంలో ఏర్పాటుకాబోతున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో నిజాంషుగర్స్‌కు మంచి రోజులు వస్తాయనే విశ్వాసం, ఆశాభావంతో ఉన్నామని కార్మిక నాయకుడు నాగేశ్వర్‌రావు అన్నారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులకు అందాల్సిన వేతన బకాయిలు, ఇతర సమస్యలు పరిష్కారాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటమితో ఫ్యాక్టరీకి పట్టిన శని విరగడైందని పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని శక్కర్‌నగర్ షుగర్ ఫ్యాక్టరీ ప్రధాన గేటును గోదావరి నీళ్లతో శుద్ధి చేసి కార్మికులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ.. మూతపడిన నిజాంషుగర్స్‌ను తెరిపిస్తామని ఏఐసీసీ అగ్రనేత ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. బకాయి వేతనాల కోసం కార్మికులు చేస్తున్న రిలే దీక్షను కొనసాగించారు. కార్మికులు సత్యనారాయణ, వికారుద్దీన్, రాంసింగ్ లింగంగౌడ్, గాలయ్య, నయీమొద్దీన్, నాగరాజు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండల ఆరె కటిక నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోగికర్ శివశంకర్, ఉపాధ్యక్షుడిగా వంకార్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా మురార్‌కార్ గంగారాం, కోశాధికారిగా కోల్కర్ గణేశ్, సలహాదారులుగా మోహన్, శ్రీనివాస్, సభ్యులుగా కాశీరాం, సాయినాథ్, ఈశ్వర్, మొగులాజి, శివాజీ, మోహన్, అశోక్, నరేందర్‌ను ఎన్నుకున్నారు.

సాధారణ ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి అన్నారు. 2024లో జరుగనున్న సాధారణ ఎన్నికల్లో బీజేపీని ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తాడ్వాయిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి కారణంగానే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించిందన్నారు. తెలంగాణలో ఎనిమిది అసెంబ్లీ స్థానాలను గెలుపొందిందన్నారు. సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, మండల అధ్యక్షుడు వెంకట్‌రావు, స్టేట్ కౌన్సిల్‌మెంబర్ రవీందర్ రావు, నాయకులు పాల్గొన్నారు.



దీపాలు వెలిగిస్తున్న మహిళలు




స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



లక్ష దీపార్చన

కాలభైరవుడి సన్నిధి లక్షదీపార్చనతో కళకళలాడింది. దక్షిణ కాశీగా పేరుగాంచిన ఇసన్నపల్లి (రామారెడ్డి)లో కాలభైరవుడి జన్మదిన వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరాగా, భైరవ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. – రామారెడ్డి



దీపాలతో ప్రత్యేక అలంకరణ






దీపాలు వెలిగిస్తున్న భక్తులు, ఆలయ అర్చకులు, సిబ్బంది

బాల్కొండ ఓటర్లది విలక్షణ తీర్పు

- ఏ పార్టీని ఆదరిస్తారో తెలియని పరిస్థితి
- అధికార పక్షానికి చెక్ పెట్టిన సందర్భాలెన్నో..
- ఒక్కో ఎన్నికలో ఒక్కో విధమైన తీర్పు

అసెంబ్లీ ఎన్నికల్లో ఒక విధమైన తీర్పు, పార్లమెంట్ ఎన్నికల్లో మరో విధమైన తీర్పు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులను గెలిపిస్తూ బాల్కొండ నియోజకవర్గ ఓటర్లు విలక్షణ తీర్పునిస్తున్నారు. ఈ సాధారణ ఎన్నికల్లో సైతం విజయం సాధించి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో వస్తుండగా, బాల్కొండలో మాత్రం బీఆర్ఎస్‌కు పట్టం కట్టారు.

– మోర్తాడ్(బాల్కొండ)



బాల్కొండ నియోజకవర్గంలోని ఓటర్ల నాడి అంతుచిక్కకుండా ఉంది. ఒక్కో ఎన్నికలో ఒక విధమైన తీర్పునిస్తూ తమ విలక్షణతను చాటుకుంటున్నారని రాజకీయ పరిశీలకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా తీర్పు వెలువడింది. ఈ నియోజకవర్గంలో మాత్రం ప్రతిపక్ష పాత్ర పోషించబోయే బీఆర్ఎస్‌కు ఓటర్లు పట్టం కట్టడం గమనార్హం. మూడోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి ప్రశాంత్‌రెడ్డికి 70,417 ఓట్లు లభిస్తే ఆయన సమీప అభ్యర్థిగా ఉన్న కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డికి 65,884 ఓట్లు దక్కాయి.

బాల్కొండ నియోజకవర్గానికి పలుమార్లు జరిగిన ఎన్నికల్లో ఓటర్లు ఇలాంటి భిన్నమైన తీర్పును ఇస్తూ ఇతర నియోజకవర్గాల దృష్టిని ఆకర్షించారు. 1994, 1999 ఎన్నికల్లోను టీడీపీ అధికారంలోకి వస్తే ఇక్కడ మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌రెడ్డిని ఓటర్లు గెలిపించారు. 2004లో మాత్రం మరోసారి కాంగ్రెస్‌కు విజయాన్నికట్టబెట్టగా, అప్పట్లో కాంగ్రెస్ అధికారం చేపట్టింది. 2009లో రెండోసారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బాల్కొండ ఓటర్లు మాత్రం ప్రజారాజ్యం అభ్యర్థిగా పోటీ చేసిన ఈరవత్రి అనిల్‌ను అసెంబ్లీకి పంపించారు. అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వాసుబాబు ఓటమి పాలయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక విధమైన తీర్పు, పార్లమెంట్ ఎన్నికల్లో మరో విధమైన తీర్పు, స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారంలో లేని పార్టీ అభ్యర్థులను గెలిపిస్తూ నియోజకవర్గ ఓటర్లు అందరినీ ఆశ్చర్యానికి గురి చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

స్థానిక ఎన్నికల్లో..

2014 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టంకట్టిన ఓటర్లు.. మోర్తాడ్ మండల పరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసిన వారిని ఎంపీటీసీలుగా గెలిపించడం గమనార్హం. అలాగే 2018 ఎన్నికల్లోను బీఆర్ఎస్ ప్రభంజనం కనిపిస్తే 2019 స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏర్గట్ల జడ్పీటీసీ స్థానాన్ని కాంగ్రెస్ అభ్యర్థికి కట్టబెట్టారు. అప్పట్లో ఎంపీటీసీ సభ్యులు కూడా ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు ఎక్కువగా గెలిచి ఓటర్ల నాడిని అంతుచిక్కకుండా చేశారు.

పార్లమెంట్ ఎన్నికల్లో..

2018 ముందస్తు ఎన్నికల్లో ప్రశాంత్‌రెడ్డికి భారీ విజయం అందించిన ఈ నియోజకవర్గ ఓటర్లు 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌కు ఎక్కువ ఓట్లు వేసి మెజార్టీ అందించడం విశేషం. ముందస్తు అసెంబ్లీ ఎన్నికలకు పార్లమెంట్ సాధారణ ఎన్నికల పోలింగ్‌కు కేవలం ఐదు నెలల వ్యవధి ఉండగా ఈ కాలంలోనే ఓటర్లు తమ తీర్పును మార్చి ఇవ్వడం రాజకీయ పరిశీలకులనే మంత్రముగ్ధులను చేసింది.

మండలాల్లో విభిన్నం..

ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్ల లెక్కింపును పరిశీలిస్తే ఒక్కో మండలంలో ఒక్కో పార్టీకి మెజార్టీ ఇచ్చిన బాల్కొండ ఓటర్లు ఎప్పుడు ఏ పక్షమో గుర్తించకుండా వ్యవహరించారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో కాంగ్రెస్‌కు మెజార్టీ ఇవ్వగా, బాల్కొండ, భీమ్‌గల్, వేల్పూర్ మండలాలు బీఆర్ఎస్ పార్టీకి మెజార్టీ ఓట్లు అందించాయి. మోర్తాడ్, ముప్కాల్, మెండోరా, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి మండలాల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మెజార్టీ లభించడం విశేషం. స్వల్ప ఆధిక్యతతో గెలిచిన ప్రశాంత్‌రెడ్డిని భీమ్‌గల్, వేల్పూర్, బాల్కొండ మండలాలు ఆదుకున్నాయి. ఇలా బాల్కొండ ఓటర్లు తమ తీర్పును ఎప్పుడు ఏ విధంగా ఇస్తారో తెలియక అందరిని తికమకపెడుతున్నారని చెప్పొచ్చు.

పాఠకులే కవిత్వానికి కోట

- కవయిత్రి డాక్టర్ అమృతలత
- ఘనంగా హరిదా సరస్వతీరాజ్ రాష్ట్ర స్థాయి కవి సమ్మేళనం



రచయిత్రి అమృతలతను సన్మానిస్తున్న కవులు, రచయితలు

నిజామాబాద్ సిటీ: పాఠకులే కవిత్వానికి కోట వంటివారని, పాఠకులను మెప్పించే కవిత్వం రాయడం నిబద్ధతతోనే సాధ్యమని రచయిత్రి, విద్యావేత్త డాక్టర్ అమృత లత అన్నారు. నగర శివారులోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో సరస్వతీ రాజ్ హరిదా పురస్కార సభ, రాష్ట్రస్థాయి కవి సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించగా, అమృతలత ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కవిత్వంలో భావ కవిత్వం, ప్రణయ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వం వేటికవే సమాజాన్ని చైతన్య దిశలో నడిపాయని ఆమె అన్నారు. హరిదా రచయితల సంఘం రాష్ట్రస్థాయి కార్యక్రమాలను నిర్వహించడంలో తనదైన ముద్ర వేసిందని, హరిదా అంటే బలమైన సాహిత్య వేదిక అని అభినందించారు. గౌరవ అతిథిగా హాజరైన తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి శంకర్ మాట్లాడుతూ.. తెలుగు సాహిత్య మూలాలను తెలుసుకోవాలంటే నిజామాబాద్ జిల్లా వైపు చూడాలనేది పరిశోధకుల అభిప్రాయమన్నారు. అస్మకజనపదం నాటి నుంచి గొప్ప నాగరికత, చరిత్ర, సాహిత్యం ఇక్కడి ప్రజల జీవితంలో భాగమైందని వివరించారు. సభాధ్యక్షత వహించిన హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ మాట్లాడుతూ.. కవులు, కవయిత్రులు అనధికార శాసనకర్తలని, వారు నిజాయితీగా వ్యవహరించి సమాజానికి మేలు చేసి రుణం తీర్చుకోవాలని కోరారు. పురస్కారాల ప్రదాత, నవ్య భారతి విద్యాసంస్థల చైర్మన్ క్యాతం సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలంటే వారిని మంచి పాఠకులుగా తీర్చిదిద్దాలని, ఆ బాధ్యతను తల్లిదండ్రులు, గురువులు స్వీకరించాలని కోరారు. అనంతరం హరిదా రచయితల సంఘం అందిస్తున్న ' సరస్వతీ రాజ్ – హరిదా ప్రతిభా మూర్తి పురస్కారం'ను డాక్టర్ అమృతలతకు అందించి ఘనంగా సన్మానించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 52 మంది కవులు, కవయిత్రులు కవితా గానం చేశారు. కవితా పఠనం చేసిన సాహితిమూర్తులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, దారం గంగాధర్, అనిల్ బత్తుల, కాసర్ల నరేశ్ రావు, తిరుమల శ్రీనివాస్ ఆర్య, కంకణాల రాజేశ్వర్, సూరారం శంకర్, మద్దుకూరి సాయిబాబు, సిరిగాద శంకర్, ఎం కవిత, డాక్టర్ చీదెళ్ల సీతాలక్ష్మి, మూర్తి, తాడూరి ప్రవీణ్, క్లౌం నవీన్‌రెడ్డి, వసంత లక్ష్మణ్, రేణుక, తల్లావజ్ఝల మహేశ్‌బాబు, డాక్టర్ వెంకన్నగారి జ్యోతి, ఎంఏ రషీద్ పాల్గొన్నారు.

విదేశాల్లో కాంగ్రెస్ సంబురాలు



ఇజ్రాయిల్‌లో కేక్ కట్ చేస్తున్న ఎన్ఆర్ఐలు



లండన్‌లో మాట్లాడుతున్న కళ్యాణ్‌రెడ్డి

ఆర్మూర్/ఇందల్వాయి: రాష్ట్రంలో కాంగ్రెస్ విజయం సాధించడంతో ఆ పార్టీ ఎన్ఆర్ఐ శ్రేణులు విదేశాల్లో సంబురాలు చేసుకుంటున్నాయి. ఇజ్రాయిల్‌లో స్థిరపడిన తెలంగాణ ప్రాంతీయులు ఇజ్రాయిల్ తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కేక్ కట్ చేయడంతోపాటు స్వీట్లు తినిపించుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇజ్రాయిల్‌లోని రాహత్‌గాన్ పట్టణంలోని రాశి ప్రాంతంలో సంబరాలు నిర్వహించారు. తొర్లికొండ మహేందర్‌గౌడ్, అంకాపూర్ తిరుపతిగౌడ్, నిజామాబాద్ సతీశ్, నికాల్‌పూర్ రవిగౌడ్, అంకాపూర్ బానాల గంగాధర్, రాజేశ్, రాజు, ఆర్మూర్ సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

లండన్‌లో..

లండన్ ఎన్ఆర్ఐ సెల్ ఆధ్వర్యంలో లండన్ నగరంలో విజయోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా లండన్ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు కుటుంబ పాలనకు స్వస్తి పలికారని, కాంగ్రెస్ ఆరు నెలల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసి తీరుతుందన్నారు. కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచిన తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ఎన్ఆర్ఐల తరఫున అభినందనలు తెలుపుతున్నామన్నారు. కళ్యాణ్‌రెడ్డి, గంప వేణుగోపాల్, శ్రీధర్ నీల, కమలాకర్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి జూడో జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన జూడో బాలుర జట్టు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి జూడో బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. జిల్లా సంఘం కార్యదర్శి అభినవ్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ సోమవారం జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ ప్రభుత్వ స్విమ్మింగ్‌పూల్ ఆవరణలో జరిగింది. బాలబాలికల విభాగంలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఎంపికైన వారు ఈ నెల 5,6 తేదీల్లో కరీంనగర్ జిల్లా సుల్తానాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో జిల్లా జూడో సంఘం కోశాధికారి గంగామురళి, పీఈటీలు అనిత, మానస, గంగాప్రసాద్, రమేశ్, దిలీప్, వికాస్, శ్రీకాంత్, ప్రకాశ్ పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన జూడో బాలికల జట్టు

విలీన వీఆర్ఏలకు వేతన వెతలు

- వివిధ శాఖల్లో విలీనం చేసినా ఐడీ కార్డులివ్వలేదు
- ఏడు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్న సిబ్బంది
- కొత్త ప్రభుత్వమైనా సరిదిద్దాలని విజ్ఞప్తి



మోర్తాడ్(బాల్కొండ): గ్రామ రెవెన్యూ అధికారులుగా(వీఆర్ఏ) పనిచేసిన వారికి పేస్కేల్‌ను వర్తింపచేస్తూ వివిధ శాఖల్లో విలీనం చేసిన కేసీఆర్ ప్రభుత్వం వేతనాలు చెల్లించే ప్రక్రియను పూర్తి చేయకపోవడంతో ఉద్యోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెవెన్యూ శాఖలో కొనసాగిన ఉద్యోగులను నీటిపారుదల, విద్యా, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, వ్యవసాయ తదితర శాఖల్లో విలీనం చేశారు. జూలైలో విలీనం కోసం ఉత్తర్వులను జారీ చేయడంతో పాటు పేస్కేల్ వర్తింప చేస్తూ కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా జిల్లాలో 1,624 మంది వీఆర్ఏలు వివిధ శాఖలలో విలీనం చేయబడ్డారు.

కార్డులు జారీ చేయాల్సి ఉన్నా..

పే స్కేల్ ఉత్తర్వులను జారీ చేసిన వెంటనే ఉద్యోగులకు ఏ శాఖలో పని చేస్తే ఆశాఖ ఉన్నతాధికారులు ద్వారా గుర్తింపు(ఐడెంటిటీ) కార్డును జారీ చేయాల్సి ఉంది. గుర్తింపు కార్డు ఆధారంగానే ఉద్యోగులకు ఆర్థిక శాఖ ద్వారా వేతనాలు ఖాతాల్లో జమ అవుతాయి. ఉద్యోగులకు ఐడెంటిటీ కార్డులు జారీ చేయడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించడంతో ట్రెజరీల ద్వారా వేతనాలు విడుదల కాలేకపోయాయి. వీఆర్ఏలను విలీనం చేసిన సమయంలో సరైన మార్గదర్శకాలను జారీ చేయకపోవడం, విధి విధానాలను నిర్దేశించకపోవడంతో ఉద్యోగుల పరిస్థితి అయోమయంగా మారింది. విలీనం చేసిన తర్వాత నాలుగు నెలలు, గతంలో సమ్మె చేసిన రెండు నెలల కాలానికి సంబంధించిన వేతనాలు వీఆర్ఏలకు ప్రభుత్వం బకాయి పడింది. ప్రతి వీఆర్ఏకు ఏడు నెలల వేతనం చెల్లించాల్సి ఉండగా బీఆర్ఎస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా కాలేదని ఉద్యోగుల ఆరోపిస్తున్నారు. ఎన్నికల విధులతో పాటు తాము పని చేసే శాఖ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించినా వేతనాలు అందకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఏర్పడబోయే కొత్త ప్రభుత్వమైనా స్పందించి తమకు బకాయిపడిన వేతనాలు జమ చేయడంతో పాటు ఇక నుంచి ఎలాంటి జాప్యం లేకుండా వేతనాలు అందించాలని విలీన వీఆర్ఏలు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్రైం కార్నర్

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య



బీబీపేట: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దొంతుల సిద్ధరాములు(54) ఆరు నెలల క్రితం పక్షవాతం బారినపడ్డాడు. పక్షవాతానికి తోడు దమ్ము వస్తుండడంతో ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నాడు. అయినప్పటికీ నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తల్లి లచ్చవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయిరెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

గాంధారి(ఎల్లారెడ్డి): గాంధారి మండలంలోని నేరల్‌తండా సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన సుద్దాల చిన్న నర్సయ్య(65) నిజామాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి బంధువు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల ఘర్షణ

బోధన్ టౌన్(బోధన్): బోధన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం రాత్రి బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ నెలకొంది. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి సామగ్రి తరలిస్తున్నారనే సమాచారం మేరకు కాంగ్రెస్ నాయకులు అక్కడి చేరుకున్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి సామగ్రిని లోడ్ చేసిన డీసీఎం వాహనాన్ని అడ్డుకున్నారు. ప్రభుత్వానికి చెందిన ఫ్యాన్లు, ఏసీలు, వాటర్ ట్యాంక్‌తోపాటు ఇతర ఫర్నిచర్‌ను ఎవరికీ చెప్పి తరలిస్తున్నారని ప్రశ్నించడంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఇరు వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఘర్షణ పడుతుండగా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని చెదరగొట్టారు. కౌన్సిలర్ శరత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ నాయకులు ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎవరి ఆధీనంలో ఉందని ప్రశ్నించగా, ఆర్అండ్‌బీ ఆధీనంలో ఉందని ఆయన తెలిపారు. అధికారులకు సమాచారం ఇవ్వకుండా దొంగతనంగా సామగ్రి తరలించుకుపోవడం ఏమిటని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఆర్అండ్‌బీ అధికారి కాంగ్రెస్ నాయకులతో మాట్లాడారు. అధికారులకు సమాచారం ఇవ్వకుండా సామగ్రి తరలిస్తే సహించేది లేదని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు.